

సత్యదేవునికి రూ.లక్ష విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి విశాఖకు చెందిన గేదెల వరలక్ష్మి రూ.లక్ష విరాళాన్ని శనివారం అందచేశారు. వారికి ఏఈఓ కృష్ణారావు అన్నదానం బాండు అందజేశారు.



వెండి చీర సమర్పణ

ఆలమూరు: మూలస్థానం అగ్రహారంలోని మూలేశ్వరస్వామి ఆలయానికి పేరూరి మహేంద్రనాథ్ దంపతుల నేతృత్వంలో వంశీకులు రూ.2.2 లక్షల విలువైన వెండి చీర ఇచ్చారు.

డెల్టాలకు 8,700 క్యూసెక్కుల నీరు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,600, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద 9.60అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

పరిశ్రమలను తరచూ తనిఖీ చేయాలి

సేఫ్టీ కమిటీలకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం



సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలోని రసాయన ఇతర పరిశ్రమలను సేఫ్టీ కమిటీ బృందాలు తరచూ తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. పరిశ్రమల్లో సాంకేతిక అంశాలకు సంబంధించి ఎక్కడ ఎటువంటి చిన్న తప్పిదం జరిగినా ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. అస్సాగో, ఏపీ పేపర్ మిల్, ఠాగూర్ ల్యాబ్, ధరణి కెమికల్ వంటి పరిశ్రమల సాంకేతిక అంశాలపై తనిఖీలు చేసి నివేదికల సమర్పించాలన్నారు. జిల్లాలో పరిశ్రమలకు ప్రోత్సాహం అందించేందుకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఒక్క చోటే ఇస్తున్నట్లు తెలిపారు. గిరిజన ఉత్పత్తులను స్థానికంగానే కాకుండా దేశ, అంతర్జాతీయ మార్కెటింగ్‌లో విక్రయించేందుకు ఆన్‌లైన్ సౌకర్యం కల్పించాలని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అనుమతి లేకుండా మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. అనుమతి రవాణా పత్రం లేకుండా రవాణా చేయకూడదన్నారు. ఈ నియమాలను ఉల్లంఘించిన వారు శిక్షార్హులన్నారు.

భాగ్యనగర్ ఫ్యాక్టరీలో ప్రమాదం

ఇద్దరు కార్మికులకు గాయాలు



ఫ్యాక్టరీలో గాయపడిన కార్మికులు రాజ్‌కుమార్, నరేష్



గోపాలపురం: మండలం సగ్గొండ పంచాయతీ పరిధిలో గల భాగ్యనగర్ క్లోరైడ్ ప్రైవేటు లిమిటెడ్ ఫ్యాక్టరీలో శనివారం అల్యూమినియం ఫ్లోరైడ్ ఒక్కసారిగా బయటకు పొక్కడంతో ఇద్దరు కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. వారికి తాళ్లపూడి ప్రైవేటు ఆసుపత్రిలో యాజమాన్యం చికిత్స చేయించింది. ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న మల్లిపూడి రాజ్‌కుమార్ తన పరిశీలనలో భాగంగా పైప్ నుంచి అల్యూమినియం పౌడర్ లీక్ కావడాన్ని గమనించి వెంటనే సుమారు 12 అడుగుల ఎత్తు నుంచి భయంతో కిందికి దూకాడు. దీంతో కాలి మడం విరిగినట్లు తెలిపారు. అలాగే పైపు కింద పని చేస్తున్న మరో కార్మికుడు గంగుల నరేష్‌పై అల్యూమినియం పౌడరు పడడంతో మెడ, వీపు, కాళ్లు కాలిపోయినట్లు తెలిపారు. గతంలోనూ ఈ ఫ్యాక్టరీలో రెండు సార్లు అల్యూమినియం పైపులు పగిలి ప్రమాదాలు చోటుచేసుకున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు తెలిపారు.

మామూళ్లు.. గమ్మత్తుగా!

- మద్యం దుకాణాల నుంచి నెలవారీ వసూళ్లు
- స్థాయిని బట్టి నెలకు రూ.10 వేల నుంచి.. బెల్ట్ షాపుల దగ్గర రూ.3 వేలు
- ఇదే అదునుగా అడ్డగోలుగా విక్రయాలు
- పర్మిట్ రూములు పెట్టినా తనిఖీలు సున్నా



చురుగ్గా సాగుతున్న మద్యం విక్రయాలు



సాక్షి, రాజమహేంద్రవరం: ఎక్సైజ్‌శాఖలో మామూళ్ల మత్తు గుప్పుమంటోంది. ప్రతి మద్యం దుకాణం నుంచి కొంతమంది ఆ శాఖ సిబ్బంది నెలవారీ మామూళ్లకు అజ్యం పోస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. షాపులో జరిగే వ్యాపారాన్ని బట్టి ధర నిర్ణయిస్తున్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వసూళ్లు చేతులు మారుతున్నాయి. ఇందుకు ప్రత్యేకంగా ఆయా సర్కిళ్లలో ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. షాపుల పరిధిలో నడిచే బెల్టు దుకాణాలను సైతం వదలట్లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆమ్యామ్యాలు ముట్టజెబుతుండటాన్ని అదునుగా తీసుకుంటున్న మద్యం వ్యాపారులు ఇష్టానుసారంగా మద్యం విక్రయిస్తున్నారు. డోర్ డెలివరీ చేస్తున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అనధికార పర్మిట్ రూములు పెట్టి మరీ తాగిస్తున్నా కనీసం అటువైపు కనెత్తి చూసే అధికారి కరువయ్యాడు. వెరసి గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. దీనికి తోడు పోలీసులు సైతం ఇదే పంథా కొనసాగిస్తుండటంతో మద్యం అక్రమ వ్యాపారం 'మూడు క్వార్టర్లు... ఆరు బీర్లు' అన్న చందంగా సాగుతోంది.

ఒక్కో దుకాణం నుంచి రూ.10 వేలు?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం దుకాణాలను ప్రైవేటు పేరుతో వారి తమ్ముళ్లకు కట్టబెట్టింది. ఇదే అవకాశంగా మలచుకున్న బ్రాందీ షాపుల యజమానులు అక్రమ ఆదాయంపై దృష్టి పెట్టారు. జిల్లా వ్యాప్తంగా 125 మద్యం దుకాణాలకు అబ్కారీ శాఖ అనుమతులు ఇచ్చింది. ఇంకేముంది ఆ శాఖలోని కొందరు అధికారులే అడ్డగోలు వ్యవహారానికి దిగారు. ఒక్కో దుకాణానికి ఒక్కో ధర నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక్కో మద్యం దుకాణదారు ప్రతి నెలా రూ.10 వేలు ఎక్సైజ్ శాఖకు కప్పం కట్టాల్సిందే. వాటి పరిధిలోని బెల్టు షాపులకు ఒక్కో దుకాణానికి రూ.3 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రతి నెలా ఇది తప్పనిసరి చేశారు. ఎవరైనా కాదంటే ఆ దుకాణాలపై దాడులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఆయా ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో వసూళ్లకు ఓ సిబ్బందిని నియమించినట్లు తెలిసింది. తాము వసూలు చేసి ఉన్నతాధికారులకు చెల్లించాలని చెబుతూ దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్నా ఆ శాఖ ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవడంతో విమర్శలకు దారితీస్తోంది. మామూళ్లు దండుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా..? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

నిద్రావస్థలో టాస్క్‌ఫోర్స్

దుకాణాల వద్ద అధిక ధరలకు మద్యం విక్రయించినా, బెల్టు షాపులను అరికట్టేందుకు ఏర్పాటైన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం నిద్ర నటిస్తోంది. ప్రతి షాపు వద్ద పర్మిట్ రూంలు ఏర్పాటు చేసి తాగించేస్తున్నా ఒక్క చోటా దాడులు చేసిన పాపాన పోలేదు. నిబంధనల మేరకు దుకాణాల వద్ద గ్లాస్, స్టఫ్ లాంటి వస్తువులు విక్రయించకూడదు. కానీ అవేమీ పట్టనట్లు ప్రతి చోటా విక్రయించేస్తున్నారు. కొందరైతే షాపుల వద్దే తప్పతాగుతున్నా.. తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఒక్క కేసైనా నమోదు చేశారా?

మద్యం దుకాణాల ఆధ్వర్యంలో బెల్టు షాపులు నిర్వహిస్తే దాని అనుమతులు రద్దు చేస్తామని స్వయాన సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రతి షాపు పరిధిలో 30కు పైగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ఇది తెలిసినా ఎక్సైజ్ అధికారులు ఒక్క షాపుపైనా దాడులు చేసిన దాఖలాలు లేవు. ఇటీవల రెండు గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో మద్యం పట్టుబడింది. అయినా కేసులు నమోదు చేయడంలో ఎక్సైజ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

పోలీసుల మిలాఖత్!

మద్యం వ్యాపారులతో కొందరు పోలీసులు సైతం మిలాఖత్ అయినట్లు విమర్శలున్నాయి. బ్రాందీ దుకాణాల వద్ద నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్న తెలిసింది. మీది మీరు తీసుకోండి.. మాది మేము తీసుకుంటామన్నట్లు కొందరు ఎక్సైజ్, పోలీసులు వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

ఏరులై పారుతున్న మద్యం

అడిగేవాడు, అడ్డుచెప్పేవాడు లేకపోవడంతో మద్యం సిండికేట్ ఇష్టానుసారంగా రెచ్చిపోతోంది. సింహభాగం మద్యం దుకాణాలు దక్కించుకున్న కూటమి నేతల నేతృత్వంలోని సిండికేట్ ధనార్జనే ధ్యేయంగా విక్రయాలు చేపడుతోంది. పల్లె, పట్నం అన్న తేడా లేకుండా ఎక్కడ చూసినా మద్యం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒక్కో మద్యం దుకాణానికి అనుబంధంగా కనీసం 30కి పైగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేశారు. పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా బెల్ట్ షాపు ప్రారంభించేశారు. బడ్డీకొట్లు, పాన్‌షాపులు, కర్రీ సెంటర్ల వద్ద యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వైన్ షాపుల నుంచి ఎమ్మార్పీకి కొనుగోలు చేస్తున్న బెల్ట్ వ్యాపారులు క్వార్టర్ బాటిల్‌పై రూ.10 నుంచి రూ.30 వరకు అదనంగా వసూళ్లు చేస్తున్నారు. మరో అడుగు ముందుకేసి ఫోన్ కొడితే చాలు మద్యం ఇంటి వద్దకు చేరుస్తున్నారు. బెల్ట్ షాపుల వ్యవహారం సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో వైరల్‌గా మారడంతో దాడులు చేశారే తప్ప.. కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు.

ఎక్సైజ్ ఈవో అసోసియేషన్ అధ్యక్షుడిగా శివప్రసాద్

కాకినాడ క్రైం: ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి ఎన్నిక శనివారం కాకినాడలోని ఎక్సైజ్ కార్యాలయంలో జరిగింది. ఈ ఎన్నికలో ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పి.శివప్రసాద్, సహాయ అధ్యక్షురాలిగా పి.సూర్యకుమారి, ఉపాధ్యక్షుడిగా పి.శ్రీనివాస్, కార్యదర్శిగా ఎ.సతీష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.వెంకట లక్ష్మి, సంయుక్త కార్యదర్శిగా కేవీఎస్ఆర్ రవితేజ, కోశాధికారిగా పి.వంశీరామ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె.రామ్మోహన్‌రావు, టి.నిరంజన్‌రావు, ఆర్.క్రాంతి కిరణ్, ఏ.రామాంజనేయ, జె.విజయకుమార్, కె.అన్నవరం ఎంపికయ్యారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలలో విద్యుత్ బిల్లుల వసూళ్ళ కౌంటర్లు ఆదివారం కూడా పని చేస్తాయని ఏపీ ఈపీ డీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కె.తిలక్ కుమార్ శనివారం ప్రకటించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేసారు.

ఉత్సాహంగా హాకీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటి): కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న సివిల్ సర్వీసెస్ ఆల్ ఇండియా హాకీ పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, ఒలింపిక్ సంఘ సీఈఓ, ప్రధాన కార్యదర్శి చంద్రు గోవిందరాజు, ట్రస్ట్ హాస్పటల్ అధినేత డాక్టర్ రామకృష్ణలు క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. మహిళల విభాగంలో బీహార్ సెక్టార్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒడిస్సా సెక్టార్ 7-0 స్కోర్‌తో, ఢిల్లీ సెక్టార్‌తో జరిగిన మ్యాచ్‌లో హర్యాణా సెక్టార్ 4-0 స్కోర్‌తో, తెలంగాణ సెక్టార్‌తో జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ సెక్టార్ 20-0 స్కోర్‌తో గెలిచాయి. పురుషుల విభాగంలో కర్ణాటక సెక్టార్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒడిశా 10-2 స్కోర్‌తో, ఆర్బీఎస్ సిమ్లా మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్బీఎస్ కాన్పూర్ 2-0 స్కోర్‌తో గెలవగా, ఆర్బీఎస్ ముంబాయి, ఆర్బీఎస్ బెంగుళూరు మధ్య జరిగిన మ్యాచ్ 1-1 స్కోర్‌తో డ్రాగా ముగిసింది. ఉత్తరాఖండ్ సెక్టార్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ సెక్టార్ 5-0 స్కోర్‌తోను, మధ్యప్రదేశ్ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్టార్ 5-0 స్కోర్‌తో విజయం సాధించాయి.

న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యం

కొంతమూరుకి చెందిన యువతి ఆవేదన



వివరాలు చూపిస్తున్న లక్ష్మీకాంతం

రాజమహేంద్రవరం సిటీ: తనను పెళ్లిపేరుతో మోసం చేయడమే కాకుండా తనపై దాడిచేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారని పోలీసులను ఆశ్రయిస్తే అక్కడా న్యాయం చేయకపోగా తనపైనే కౌంటర్ కేసు పెట్టి వేధిస్తున్నారని నెరుగొండల లక్ష్మీకాంతం ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తనకు జరిగిన అన్యాయంపై రాజానగరం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశానని, తనపై నలుగురు దాడి చేస్తే పోలీసులు కేసు నమోదు చేసి ఒక్కరిని మాత్రమే అరెస్టు చేశారని ఆమె వాపోయింది. గతంలోనే తన కేసును నీరు గార్చేందుకు ప్రయత్నించిన పోలీసులు ఇప్పుడు నిందితులకు కొమ్ముకాస్తూ వేధిస్తున్నారని ఆరోపించారు. జాన దివ్య శేఖర్ అనే వ్యక్తి తనను పెళ్లి చేసుకుని అన్ని విధాలా మోసం చేశాడని ఆరోపించారు. రాజానగరం పోలీసులు తాము చెప్పిన చోటల్లా సంతకం పెట్టి కేసు విత్ డ్రా చేసుకోకపోతే తన పైనే కేసులు పెట్టి లోపల వేస్తానని బెదిరిస్తున్నారని ఆరోపించింది. అలాగే వారి మాట వినకపోతే ఇంట్లో గంజాయి పెట్టించి కేసు పెడతామని, వ్యభిచారం కేసు పెడతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు ఇప్పటికైనా న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమన్నారు.

కింకర్తవ్యం చెప్పు స్వామీ!

- రత్నగిరికి చివరి ర్యాంకుపై తర్జన భర్జన
- రేపు జిల్లా కలెక్టర్ సమీక్ష
- సూచనలతో ఆలయ సిబ్బంది సమాయత్తం



అన్నవరం దేవస్థానం

అన్నవరం: రత్నగిరికి ఏడో ర్యాంకుపైనే సర్వత్రా చర్చ. దేవస్థానంలో భక్తులకు అందిస్తున్న సేవలు, ప్రసాదం తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో చివరి ర్యాంకు రావడంపై స్వయంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ దృష్టి సారించారు. సోమవారం ఉదయం 11 గంటలకు దేవస్థానంలో ఆయన నిర్వహించనున్న సమీక్షపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సిబ్బంది పనితీరు, దాతల అసంతృప్తి, పాలనపై అధికారులకు పట్టు లేకపోవడం వంటి విషయాలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.

పాతికేళ్ల క్రితం సైతం ఇలానే..

దేవస్థానంలో పాలన, ఆదాయ వ్యయాలపై ప్రణాళిక లేకపోవడంపై పాతికేళ్ల క్రితం ఇదే పరిస్థితి తలెత్తింది. అప్పటి ఈఓలకు పాలనాదక్షత లేకపోవడంతో కనీసం జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. అప్పటి దేవదాయ శాఖ మంత్రి ఆకస్మిక తనిఖీ చేసి ఈఓ ను మార్చి అడిషనల్ కమిషనర్ జి.కృష్ణమూర్తిని ఈఓగా నియమించి పరిస్థితిని దారిలోకి తీసుకువచ్చారు. ఆప్పుడే నిధులు లేకపోయినా ధైర్యం చేసి ప్రకాష్ సదన్ సత్రం నిర్మించారు. ఆ తరువాత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీ శేషగిరి బాబు ను ఈఓగా నియమించి పాలన సజావుగా సాగేలా తీర్చిదిద్దారు.

ప్రసాదం మినహా అన్నింటా అసంతృప్తి

ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, విజయవాడ దుర్గగుడి, శ్రీకాళహస్తి, సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, కాణిపాకం దేవస్థానాలకు వచ్చిన భక్తుల నుంచి ఐవీఆర్ఎస్ పద్ధతిపై సర్వే చేసింది. ఈ దేవస్థానాలకు వచ్చిన 36,163 మంది భక్తుల నుంచి జనవరి రెండో తేదీ నుంచి ఫిబ్రవరి ఐదో తేదీ మధ్య నిర్వహించిన ఈ సర్వేలో భక్తులు ప్రసాదం మినహా అన్నింటా అసంతృప్తి వ్యక్తం చేశారు.

స్వామివారి దర్శనానికి పట్టే సమయంపై 78 శాతం మంది, మౌలిక వసతులపై 67 శాతం మంది, ప్రసాదంపై 13 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు.

అసంతృప్తికి కారణాలు


- భక్తుడు రత్నగిరి టోల్‌గేట్ వద్ద నుంచి మళ్లీ తిరుగుప్రయాణం అయ్యేవరకు ఖర్చు పెట్టే సొమ్ములో 40 శాతం మాత్రమే దేవస్థానానికి చేరుతోంది. మిగిలిన 60 శాతం దళారులు, ఇతరుల పాలవుతోంది. హుండీలో వేసిన కానుకలు, వ్రతం టిక్కెట్, దర్శనం టిక్కెట్టు, వివిధ వ్యాపారులు కట్టే లీజు మొత్తం మినహా మిగిలినదంతా ఇతరుల పాలవడం, దీనికి తోడు భక్తులకు గౌరవ మర్యాదలు లేకపోవడం కూడా కారణంగా కనిపిస్తోంది.
- రత్నగిరిపై దుకాణాలల్లో సామగ్రి అధిక ధరలకు విక్రయించడం మరో కారణం. వ్యాపారులు వేలంలో పోటీపడి లీజు పెంచుకుని ఆ సొమ్మును ఇలా రాబట్టుకోవడం.
- దేవస్థానం బస్సులలో టిక్కెట్లు ఇవ్వకుండా డబ్బులు వసూలు చేయడంతో ఆలయ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.
- సిబ్బంది బాధ్యతా రాహిత్యంపై అధికారుల మెతకవైఖరి
- ర్యాంకింగ్ వచ్చేరోజు స్వామివారి కల్యాణం గంట పాటు ఆలస్యమైనా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం. ఇలాంటి కారణాలెన్నెన్నో ఉన్నాయి.

అధికారులతో ఈఓ సమీక్ష

దేవస్థానం వ్యవహారాలపై సోమవారం జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తున్నందున శనివారం ఈఓ వీర్ల సుబ్బారావు ఏఈఓలు, సూపరింటెండెండ్లతో మొదటి ర్యాంకు సాధనకు తీసుకోవలసిన అంశాలపై సమీక్షించారు. పశ్చిమ రాజగోపురం ఎదురుగా విశ్రాంతి షెడ్డు నిర్మాణం త్వరగా చేపట్టాలని, పలుచోట్ల మరుగుదొడ్లు నిర్మించాలని, చెప్పుల స్టాండ్ ఉచితంగా నిర్వహించాలని. భక్తులతో దురుసుగా వ్యవహరించే వ్యాపారులకు జరిమానా విధించాలని, వ్రతాల సమయంలో నిరీక్షించే సమయం ఎక్కువ కాకుండా చూడాలని ఈ సమీక్షలో పలువురు సూచించారు.

రత్నగిరికి కొనుగోళ్లలో కొత్త నిబంధన

అన్నవరం: రత్నగిరి దేవస్థానంలో ఉపయోగించే పప్పులు, ఇతర దినుసుల సరఫరా టెండర్లలో పాల్గొనే వ్యాపారులు ఫుడ్ ఇనస్పెక్టర్ ఎంపిక చేసిన శాంపిల్స్ ప్రకారం సరఫరా చేయాల్సి ఉంటుంది. ఆ మేరకు నిబంధనలు మార్చారు. టెండర్ దారులు శాంపిల్స్‌ను అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ పరిశీలించి ఎంపిక చేసిన శాంపిల్ మేరకు వ్యాపారులు సరఫరా చేసేలా, దానికి ఒక ధరను కోట్ చేస్తూ టెండరు దాఖలు చేయాల్సి ఉంటుంది. శనివారం కొన్న నిత్యావసర వస్తువులు, పప్పుదినుసుల కొనుగోలుకు టెండర్‌దారులతో సమావేశం నిర్వహించి వారిచ్చిన శాంపిల్స్‌ను అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ పరీక్షించి నివేదిక ఇచ్చారని సూపరిండెంట్ బలువు సత్యశ్రీనివాస్ తెలిపారు. ఆ శాంపిల్స్ ప్రకారం సరుకులు కొనుగోలు చేస్తామని ఆయన తెలిపారు.



క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలపై శిక్షణ

ఏలూరు (మెట్రో): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఏలూరు జిల్లాకు సంబంధించి విధుల్లో పాల్గొనే పీఓ, ఏపీఓలకు రెండో విడత శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో విధులు, ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

కొవ్వూరు: బంగారమ్మ పేటలో ఈ నెల 20న భార్యను కత్తితో నరికి చంపిన కేసులో నిందితుడు గంద్ర మురళీకృష్ణ చౌదరిని శనివారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ముద్దాయి తన భార్య కృష్ణతులసిని కత్తితో నరికి చంపి, అడ్డువచ్చిన మావయ్య అడ్డాల నాగేశ్వరరావుపై కత్తితో దాడి చేశాడు. నాగేశ్వరరావు ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మురళీకృష్ణ చౌదరిని పట్టణంలో హేవలాక్ బ్రిడ్జి సమీపంలో శనివారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి స్వస్థలం ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరు మండలం రాజగూడెం. ప్రస్తుతం వాడపల్లి శివారు గ్రామమైన బంగారమ్మపేటలో ఉంటున్నాడు.

అంతిమ సంస్కారాల్లో అన్నీ తానై..



ఆలమూరులో తండ్రి చితికి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న కుమార్తె రూప

ఆలమూరు: తన తండ్రికి అంతిమ సంస్కారాలు జరిపించి ఆ మహిళ ఆదర్శంగా నిలిచింది. ఆలమూరుకు చెందిన కొమ్మిశెట్టి లక్ష్మణరావు అలియాస్ మహాలక్ష్మి (47) కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. మృతుడు లక్ష్మణరావుకు భార్య భాగ్యలక్ష్మి, కుమార్తెలు భవానీ, రూప ఉన్నారు. తండ్రి లక్ష్మణరావుకు అంతిమ సంస్కారాలు చేసేందుకు కొడుకులు లేకపోవడంతో కుటుంబ సభ్యుల సహకారంతో, అభ్యుదయ వాదుల సలహా మేరకు కన్న తండ్రికి అంత్యక్రియలను చిన్న కుమార్తె రూప నిర్వహించారు. తండ్రి లక్ష్మణరావుకు తలకొరివి పెట్టి రుణం తీర్చుకున్నారు.

సేవలకు వందనం

- కొత్త జంట వినూత్న ప్రయత్నం
- వారు డాక్టర్లు, ఇంద్రజాలికులు
- నేడు ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం



ఈతకోటలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్లు మోహిత్, సీత

కొత్తపేట: వారిద్దరూ మార్చి 12న ఒకటి కాబోతున్నారు.. ఒకరి భావాలు ఒకరు అర్థం చేసుకుంటూ సమాజంలో పేదవారికి సహకరించాలని చక్కని సంకల్పంతో ముందుకు వెళుతున్నారు. వారి నిశ్చితార్థం అయిన గత ఏడాది డిసెంబర్ 6 నుంచి వివాహ తేదీ మార్చి 12 వరకు 100 రోజుల పాటు వంద సేవా కార్యక్రమాలను ఇరు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్నారు. వివిధ అవగాహన ర్యాలీలు, వైద్య శిబిరాలు, పేదలకు ఆహార పొట్లాలు, దుస్తులు, పేద చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ వంటి ఎన్నో సేవలు చేసి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ వివరాల్లోకి వెళితే..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలకుడు చింతా శ్యామ్‌కుమార్ (శ్యామ్ జాదుగర్) తనయుడు, కేంద్ర యోజన అవార్డు గ్రహీత, లండన్ ఫిజియోథెరపిస్ట్ మోహిత్‌కు అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన ఉప్పుగంటి శ్రీధర్ కుమార్తె, ఫిజియోథెరపిస్ట్ సాయిసీతతో వివాహం కుదిరింది. మోహిత్ కుటుంబీకులంతా ఇంద్రజాలికులు కావడంతో తను చేసుకునే భార్యకి కూడా ఇంద్రజాలంలో ప్రావీణ్యం కోసం శిక్షణ ఇచ్చారు. ఒకటి కాబోయే మోహిత్ – సీతలు ప్రపంచవ్యాప్తంగా అతి తక్కువ మందికి తెలిసిన బ్లైండ్ ఫోల్డ్ (కళ్లపై కరచీనూక వేసుకుని కళ్లకు గంతలు కట్టుకుని వాహనం నడపడం) బైక్ డ్రైవింగ్ ద్వారా వివిధ ప్రాంతాల్లో రోడ్డు నిబంధనలపై ప్రజల్లో ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. సహజంగా ఫిజియోథెరపిస్ట్ కావడంతో వీరు వివిధ ప్రాంతాల్లో పేదలకు ఉచిత అధునాతన ఫిజియోథెరపీ వైద్య శిబిరాలు నిర్వహించి ఆదర్శంగా నిలుస్తున్నారు. అంతేకాకుండా వివిధ ప్రాంతాల్లో పేదలు, వలస కూలీలు, వృద్ధులు, అనాథలకు అన్నదానం, వస్త్రదానంతో పాటు చిన్నారులకు పుస్తకాలు, పలకలు, స్టేషనరీ వంటి విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్నారు. అంతే కాకుండా వీరి వివాహానికి పెళ్లి కార్డు కూడా మొక్కల ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా తయారుచేసి ఆ కార్డుతో వివాహానికి రావాల్సిందిగా అందరికీ ఒక మొక్కను ప్రజెంట్ చేస్తూ పర్యావరణ హిత జంటగా నిలుస్తున్నారు. మెజీషియన్స్ అయిన వారిద్దరూ వెడ్డింగ్ ప్రోమో కూడా వినూత్న రీతిలో తీస్తున్నారు. అసభ్యకరమైన డ్యాన్సులు లేకుండా సమాజ హితాన్ని కోరుకుంటూ, సమాజాన్ని చైతన్యపరిచే విధంగా వెడ్డింగ్ ప్రోమో రూపొందిస్తున్నారు.

నాన్న స్ఫూర్తితో సమాజ సేవ



వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు అయినా ప్రవృత్తిరీత్యా ఇంద్రజాలికునిగా సమాజాన్ని చైతన్య పరచడంతో పాటు పేదల సేవలో నాన్న శ్యామ్ జాదూగర్ ముందుకు వెళ్తున్నారు. ఆయన బాటలోనే నేనూ వెళ్తున్నా. మన వ్యక్తిగత జీవితం, ప్రయోజనాలను కాపాడుకుంటూ కొంత సమయాన్ని, కొంత మొత్తాన్ని మానవసేవకు వినియోగించాలన్నది ఆయన తత్వం. ఆ మేరకు అనేక సేవా కార్యక్రమాలు చేశారు.

–డాక్టర్ చింతా మోహిత్,
యువ ఇంద్రజాలికుడు,
ఫిజియోథెరపిస్ట్, ర్యాలి

జీవితానికి పరమార్థం ఉండాలి



ఒక మంచి ఫ్యామిలీలోకి అడుగుపెట్టబోతున్నాను. మన జీవితాలు మన కోసమే కాదు.. సమాజానికి కూడా ఉపయోగపడాలి.. అనే మంచి మనస్తత్వంతో మ్యాజిక్ ఫ్యామిలీ ముందుకు వెళుతుంది. మా నిశ్చితార్థం అనంతరం కొన్ని రోజుల్లోనే వారి సేవా దృక్పథాన్ని అవగాహన చేసుకున్నాను. ఆ సేవలను వంటపట్టించుకున్నాను. దానికనుగుణంగా మన జీవితాలకు ఒక అర్థం.. పరమార్థం ఉండాలన్నదే లక్ష్యంగా అందరం కలిసి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–డాక్టర్ ఉప్పుగంటి సాయిసీత,
బండారులంక, అమలాపురం రూరల్ మండలం

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న దక్షిణ మండల డీఎస్పీ భవ్యకిశోర్

కడియం: వివిధ చోట్ల చోరీలకు పాల్పడిన ఐదుగురిని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, సిబ్బంది పట్టుకున్నారు. వారి నుంచి రూ.5.40 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో దక్షిణ మండల డీఎస్పీ భవ్యకిశోర్ శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కడియం మండలం మాధవరాయుడుపాలేనికి చెందిన కొత్తపల్లి త్రిమూర్తులు, పిఠాపురం మండలం ఇరవాడకు చెందిన కూరాకుల సుబ్బారావు, కపిలేశ్వరపురం మండలం వల్లూరులో నివాసం ఉంటున్న గాదంశెట్టి వెంకన్న, మండపేట మండలం కేశవరానికి చెందిన పచ్చ రాజు, రామచంద్రపురం మండలం బాడీపేటకు చెందిన గుమ్మడి సత్యనారాయణలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జనవరి 18న జేగురుపాడుకు చెందిన గంగరాజు సత్యవతి గుడికి వెళ్లి వస్తుండగా ఇద్దరు వచ్చి, ఆమె నోరుమూసి మెడలోని బంగారు మంగళసూత్రాలను లాక్కుపోయారు. పై నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాలు అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. కడియం, మండపేట రూరల్, రాజానగరం పోలీస్ స్టేషన్ల పరిధిలో వీరు నేరాలు చేసినట్లు గుర్తించారు. ఈ చోరీలకు సంబంధించి 58 గ్రాముల బంగారం, వెండి పట్టీలు, మోటార్ సైకిల్, కాపర్ వైర్, రూ. 50 వేలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అశ్రునయనాలతో కాశీ అంత్యక్రియలు

- అమలాపురం పురవీధుల్లో అంతిమయాత్ర
- క్రీడాజ్యోతితో వీడ్కోలు పలికిన క్రీడాకారులు



అమలాపురం ఆఫీసర్స్ క్లబ్ వద్ద క్రీడాజ్యోతితో కాశీకి అంతిమయాత్ర

సాక్షి, అమలాపురం: ‘క్రీడా పోటీలు చిన్నవైనా.. పెద్దవైనా క్రీడా జ్యోతి ఉండాల్సిందే. అప్పుడే ఆ క్రీడా పోటీలకు వెలుగు వస్తోంది’ షటిల్ బ్యాడ్మింటన్ జాతీయ రిఫరీ రంకిరెడ్డి కాశీ విశ్వనాథం తరచూ చెప్పిన మాటలు. ఆయన ఆకాంక్షకు తగినట్టుగానే శనివారం కాశీ అంత్యక్రియలను కుటుంబ సభ్యులు, క్రీడాకారులు నిర్వహించారు. క్రీడాజ్యోతితో ఆయన అంతిమయాత్ర నిర్వహించి ఘన నివాళి అర్పించారు. అంతర్జాతీయ స్టార్ షట్లర్ రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ తండ్రి కాశీ విశ్వనాథం గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. కాశీ పెద్ద కుమారుడు, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రామ్‌చరణ్ అమెరికా నుంచి రావడం ఆలస్యం కావడంతో శనివారం పట్టణంలో అంత్యక్రియలు నిర్వహించారు. పురవీధుల నుంచి అమలాపురం ఆఫీసర్స్ క్లబ్ మీదుగా ఈడబ్ల్యూఎస్ కాలనీ వద్ద ఉన్న హిందూ శ్మశానవాటిక వరకూ అంతిమయాత్ర సాగింది. స్థానిక ఆఫీసర్స్ క్లబ్ వద్ద కాశీ ఆధ్వర్యంలో ఆధునీకరించిన షటిల్ ఇండోర్ స్టేడియం వద్ద ఆయన భౌతిక కాయాన్ని ఉంచి ఘన నివాళి అర్పించారు. ‘స్పోర్ట్స్ ఫర్ యూనిటీ... లాంగ్ లివ్ కాశీ’ అని క్రీడాకారులు నినాదాలతో హోరెత్తించారు. కుమారుడు సాత్విక్‌తోపాటు అతని డబుల్స్ పార్టనర్ చిరాగ్ శెట్టి, అంతర్జాతీయ కోచ్ టాన్, అంతర్జాతీయ వెటరన్ క్రీడాకారులు ఏవీఎస్ నాయుడు, ఆకుల సునీల్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ కార్యదర్శి పున్నయ్య చౌదరి, ఏపీబీఏ కార్యదర్శి అంకమ చౌదరి, బాయ్ మ్యాచ్ కంట్రోలర్ ఎంఎస్ఎన్ ప్రసాద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అడబాల విజయ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, క్రీడా భారతి జిల్లా అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, కేఎస్‌బీఏ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, కార్యదర్శి గోకరకొండ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక ఉపాధ్యాయిని ఆత్మహత్యాయత్నం

- ముంగండ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల ఆందోళన
- హెచ్‌ఎంను బదిలీ చేయాలని డిమాండ్
- ఉన్నతాధికారుల హామీతో ఆందోళన విరమణ



ముంగండ హైస్కూల్‌లో హెచ్‌ఎం రూమ్ వద్ద ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులు



అమలాపురంలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయిని లావణ్య

పి.గన్నవరం: ముంగండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కనకదుర్గ వేధింపులు తాళలేక అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని లావణ్య శనివారం తన ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని పాఠశాల స్టాఫ్ సెక్రటరీ కె.సత్యనారాయణతో పాటు ఉపాధ్యాయులు విలేకరులకు తెలిపారు. ఉదయం 6 గంటలకు తాను వెళ్లిపోతున్నానంటూ లావణ్య సహచర ఉపాధ్యాయినులకు వాట్సాప్ కాల్ చేయడంతో.. వారు అప్రమత్తమై భర్తకు సమాచారం అందించడంతో కాపాడారన్నారు. లావణ్యను అమలాపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో పాఠశాల వద్ద మిగిలిన ఉపాధ్యాయులంతా కలసి హెచ్‌ఎం రూమ్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. పలు రకాలుగా తమను వేధిస్తున్న హెచ్‌ఎంను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో హెచ్‌ఎం మినహా 28 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని స్టాఫ్ సెక్రటరీ సత్యనారాయణ వివరించారు. హెచ్‌ఎం జి.కనకదుర్గ 2023 జూన్‌లో ఇక్కడ బాధ్యతలు చేపట్టారని తెలిపారు. అప్పటి నుంచి ఆమె ఉపాధ్యాయులందరినీ వేధిస్తున్నారని ఆరోపించారు. తమకు సెలవులు ఇవ్వడం లేదని, తరగతి గదుల్లో బోధన చేస్తుండగా ఆమె పరిశీలన పేరుతో వచ్చి విద్యార్థుల ముందు తమను అవమానిస్తున్నారని అన్నారు. హెచ్‌ఎం నుంచి వస్తున్న ఒత్తిడి తట్టుకోలేక గతంలో తనకు రెండు సార్లు గర్భస్రావం అయ్యిందని బయాలజీ టీచర్ బీఎస్‌డీ లావణ్య తోటి ఉపాధ్యాయినులకు చెప్పారన్నారు. ఇదిలా ఉండగా ఉన్నతాధికారుల ఉత్తర్వులు లేకుండా శుక్రవారం లావణ్యతో పాటు బయలాజికల్ ఉపాధ్యాయుడు ఎ.వెంకట సుబ్బారావును నరేంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు డిప్యుటేషన్ వేశారని తెలిపారు. దీంతో ఒత్తిడికి గురైన లావణ్య శనివారం ఉదయం భర్త ఇంట్లో లేని సమయంలో గ్రూప్ వాట్సాప్ కాల్‌లో సహచర ఉపాధ్యాయినులతో మాట్లాడారని, తాను వెళ్లి పోతున్నానని కాల్ కట్ చేశారన్నారు. ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకుంటున్నట్టు గమనించిన ఉపాధ్యాయినులు ఆమె భర్తకు అమలాపురంలోని ఇతర ఉపాధ్యాయులకు సమాచారం అందించడంతో వారు ఆమెను కాపాడి ఆస్పత్రికి తరలించినట్టు వివరించారు. ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులతో డీసీఈబీ సెక్రటరీ బీర హనుమంతరావు, పి.గన్నవరం, అంబాజీపేట ఎంఈఓలు కోన హెలీనా, వీరభద్రం, మోకా ప్రకాష్, కె.వెంకటేశ్వరరావు చర్చలు జరిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. హెచ్‌ఎం కనకదుర్గను 10 రోజుల పాటు సెలవుపై వెళ్లమని ఆదేశించడంతో.. ఆమె సెలవు పెట్టారు. అనంతరం ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యారు. ప్యాప్టో చైర్మన్ నాగిరెడ్డి శివప్రసాద్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్యపల్లంరాజు, ఎం.సుబ్బారావు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోపణలను ఖండించిన హెచ్‌ఎం

తనపై ఉపాధ్యాయులు చేసిన ఆరోపణలను హెచ్‌ఎం కనకదుర్గ ఖండించారు. ఉపాధ్యాయిని ఆత్మహత్యాయత్నంపై తనకు సంబంధించిన కారణాలు ఏమీ లేవని అన్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో నరేంద్రపురం హైస్కూల్‌లో బయాలజీ టీచర్లు లేని కారణంగా ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలతో శుక్రవారం లావణ్యతో సహా ఇద్దరు టీచర్లను డిప్యుటేషన్‌పై నియమించామన్నారు. అయితే వారు వెళ్లలేదన్నారు. దీనిపై రాత్రి అధికారులు ఆదేశాలు కూడా ఇచ్చారన్నారు. తాను హెచ్‌ఎంగా ఇక్కడికి వచ్చేసరికి పాఠశాల విద్యార్థులు చదువులో వెనకబడి ఉన్నారన్నారు. దీంతో వారిలో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్టు వివరించారు. తరగతి గదుల్లో కొందరు ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లు ఉపయోగిస్తున్నారని, దీనిని తాను వ్యతిరేకించానన్నారు. ఈ కారణాలతో తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని హెచ్‌ఎం వివరించారు.

శుభ కార్యానికి వెళ్తుండగా ప్రమాదం



సంఘటనా స్థలం వద్ద బాధితులు



రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్, వైఎస్సార్ సీపీ నేతలు

- 39 మందికి గాయాలు
- వేగాయమ్మపేటలో ఘటన

రామచంద్రపురం రూరల్: శుభకార్యానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో 39 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన వేగాయమ్మపేట వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రపురం మండలం తోటపేట శివారు గాంధీనగర్ నుంచి కె.గంగవరం మండలం మసకపల్లికి ఒక శుభ కార్యక్రమానికి గూడ్స్ ఆటోలో 40 మందితో వెళ్తుండగా వేగాయమ్మపేట గ్రామం విజయ్‌కుమార్ చర్చి సమీపానికి వచ్చేసరికి ఆటో వెనుక చక్రాల యాక్సిల్ విరిగిపోవడంతో ప్రమాదం సంభవించింది. దీంతో ఆటోలోని మహిళలు, చిన్నారులకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ తన పోలీసు జీపులో కొంత మందిని, 108, ఇతర వాహనాల సాయంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వేగాయమ్మపేట గ్రామ సర్పంచ్ అంబటి తుకారం బాధితుల తరలింపులో సహకారం అందించారు. ఒకేసారి అధిక సంఖ్యలో క్షతగాత్రులు రావడంతో ఆసుపత్రి నిండిపోయింది. బలమైన గాయాలైన జాలెం వీరవేణి, అల్లంపల్లి భారతిలను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. రామచంద్రపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్‌లు పరామర్శించారు. బాధితులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ నేతత్వంలో వైద్య బృందం సేవలు అందించింది. బాధితులు ఒక్కొక్కరికీ రూ. 3 వేల చొప్పున మొత్తం రూ.1.20 లక్షల ఆర్థిక సాయాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం ప్రకటించారు.


కంటిపూడిలో స్పోర్ట్స్ మీట్



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సర్వారాయుడు

రాజానగరం: ఉద్యోగులు, కార్మికులు క్రీడల ద్వారా పని ఒత్తిడిని అధిగమించవచ్చని కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు అన్నారు. జాతీయ రహదారిని ఆనుకుని చక్రద్వారబంధంలో ఉన్న కంటిపూడి కియా వర్క్‌షాప్ ప్రాంగణంలో కంటిపూడి స్టీల్స్, కంటిపూడి సుజుకి, కంటిపూడి నిస్సాన్, కంటిపూడి కియా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వారాయుడు మాట్లాడుతూ ఆటలు ఆడుతూ లేదా వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, డాడ్జ్‌బాల్, త్రోబాల్, రన్నింగ్ రేస్, లాంగ్‌జంప్, టెన్నికాయిట్, లెమన్ స్పూన్, బ్యాట్మింటన్, టగ్ ఆఫ్ వార్ గేమ్స్ నిర్వహించారు. కంటిపూడి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వినయ్‌బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణమూర్తి, కె.మన్మోహన్ రామ్ పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ టెన్త్ ఇంటర్ పన్ సిట్టింగ్, డిగ్రీ, పీజీ, సైన్స్ & ఆర్ట్స్, MBA, MCA అన్ని యూనివర్సిటీల పరీక్షలు మా కాకతీయ విద్యాసంస్థలు, కాకినాడ దగ్గరలోని గొల్లపాలెంలో జరుగును. 100% పాస్ గైడెన్స్. మా ఆఫీసులు: కాకినాడ, రాజమండ్రి, రావులపాలెం. ఫోన్: 98495 82043, 99494 82757 [V- 2752]

PARAMEDICAL

■ పారామెడికల్ Diploma in Medical Laboratory Technology, Diploma in Operation Theater Teachnology, Diploma in Anaesthesia Technology, Diploma in Cardiology, MPHA కోర్సు, Inter, MLT. Inter MPHW (F) అడ్మిషన్లు జరుగుచున్నవి. తమ్మినేని ఇనిస్టిట్యూట్, విజయవాడ. డా॥ టి. రామకృష్ణ ✆ 98482 42880. [B-1268423]

Real Estate

REAL ESTATE

■ రాజమండ్రి స్థానిక అర్బన్‌కి సంబంధించి స్థానిక దివాన్ చెరువు, వెలుగుబంధ, జగనన్న కాలనీ లే అవుట్ నందు ఇల్లు కట్టించుకునే వారికి ఫైనాన్స్ సౌకర్యంతో ఇల్లు కట్టించబడును. ✆ : 70756 99344, 90002 54522 [R-7360]

■ తణుకు బైపాస్, చివటం రోడ్ 290 Yds. సైట్ & హౌస్. నార్త్ ఈస్ట్ కార్నర్, ఈస్ట్ ఫేసింగ్, 80 Ft. రోడ్, కమర్షియల్ / హౌస్ యూజ్. ఫోన్ : 96770 65411, 91008 33357 [SCA25001715]

HOUSE FOR SALE

■ సర్పవరంలో చైతన్యరాజు విల్లాస్ ఎదురుగా G+1 ఈస్ట్ ఫేసింగ్, 210 స్క్వేర్ యార్డ్స్ గల హౌస్ అమ్మకమునకు కలదు. ✆ : 92900 28461, 81423 32667 [R-795]

■ కాకినాడ జగన్నాయకపూర్ నుండి 8కి.మీల దూరంలో ఉన్న పెనుగదురు వద్ద స్టేట్ హైవేకి అతి సమీపంలో చుట్టూ నిర్మించబడిన ఇళ్ళు కలవు. 138.66 చదరపు గజాల నివాస స్థలం అమ్మకానికి కలదు. రేటు: చ.గజం రూ.17000/- మాత్రమే. 9440190800 [G-1624]

PLOT FOR SALE

■ రాజమండ్రి ఎయిర్ పోర్ట్ దగ్గర నూతనంగా వేసిన లేఔట్ లో 100 గజముల సైట్ 4,50,000/-లకే 9515382999 [C-820352]

■ ఈస్ట్ ఫేసింగ్ ప్లాట్ 450 చ.గ (54X75), పోలీస్ క్వార్టర్స్ వెనుక రాజమండ్రి. క్లియర్ టైటిల్. ఇమ్మిడియట్ రిజిస్ట్రేషన్. సంప్ర॥ 9441144475 [HA-15464]

COMMERCIAL FOR SALE

■ Vijayawada, Bhavanipuram, 1519 sq.yds, Open land for sale. Commercial use, By-Pass Road, Beside Bhashyam School. Ph: 9949321555, 9848041664 [HA-99850]

Services

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 96430 10487, 8376089771, 011-25920179 [DA-6239]

Wanted

■ Reputed Bank నందు కాకినాడ నగరంలో పనిచేయుటకు మేనేజర్స్ కావలెను. మరియు 50 సం॥లు నిండిన సీనియర్ సిటిజన్స్, రిటైర్డ్ ఆఫీసర్స్, హౌస్‌వైఫ్స్ సంప్రదించగలరు. ✆ : 98487 90024 [R-201]

■ రాజమండ్రి ILTD Junction రైతు బజార్ ఎదురుగా ఉన్న విడిదిల్లు నిర్వహణ కొరకు Supervisors కావలెను. Age : 40 పైన, Cont: 92465 50443 [R-1151065]

■ తుని, పాయకరావుపేటలలో డోర్ టు డోర్ పాంప్లెట్స్ పంచి పెట్టుటకు 20 నుండి 50 సం॥ల లోపు స్త్రీ పురుషులు కావలెను. సెల్ : 73308 29362 [SCA25001775]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోస్ట్ డ్రైవర్లు-3, హెల్పరు-5, 30 సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44622 [B-1266928]

■ హైదరాబాద్‌లోని వృద్ధాశ్రమంలో పనిచేయుటకు నర్సులు, కేర్ టేకర్లు, ఆడ/ మగ/ జంట కావలెను. ఫోన్: 9347556162/ 8309615249 [DA-56921]

■ కష్టలేన్సీ కాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పు,ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు, ఫ్రీరూమ్+భోజనం. Hyd.ఫోన్: 9666253675 [HA-99924]

■ రాజమండ్రి & కాకినాడ పరిసర ప్రాంతాలలో అనుభవం గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, హోం కేర్‌లో పనిచేయుటకు స్త్రీ/పు కావలెను. సంప్ర॥ ✆ 82978 71278, 90692 34678. [B-755664]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899 [SCA25001814]

■ సాయిరామ్ హోమ్‌కేర్:Hydలో బేబీకేర్, పేషెంట్‌కేర్, ముసలివారిని చూసుకొనుటకు ఆయాలు, నర్సులు & ఇంటి/వంటపనికి కావలెను.జీ:18వేలు✆9949094607,99084 54607 [SCA25001783]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: రూ.15,000/-, Ex-సర్వీస్‌మెన్‌కు రూ.18,000/-, Cont: శ్రీదేవి హోండా, అథరైజ్డ్ డీలర్ : హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. ✆ : 94909 98888. [R-118]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ Hyd & Vja బ్రాంచీలకు 10th ఆపై చదివిన20-50 సం॥ స్త్రీ/పు టెలికాలర్స్, సూ॥వైజర్లు, అడ్మిన్లు, అకౌంటెంట్లు,కా॥.బో+ వ + జీ20 - 30 వేలు. ఫోన్: 94916 51122, 94918 21122 [SCA25001389]

■ రాజమండ్రిలో గల ప్రముఖ ఫర్నిచర్ సంస్థ నందు వర్క్ చేయుటకు 1&2 ఇయర్స్ అనుభవం గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ (M) కావలెను. మంచి జీతం ఇవ్వబడును సంప్రదించండి : 98481 35553, 98481 35554 [SCA- 25001807]

■ Wanted Computer operator M/F (MS Office, MS Excel) with speed typing in English at amalapuram area Salary 10 to 18 K full and part time Cell: 96184 66665 [SCA-25001835]

■ Wanted Male Marketing Staff, and Course incharges Qualification Any Degree Age Limit: 25 to 45years, Salary: 12,000/- to 20,000/- working Location: Master Minds College, Rajahmundry. Contact: 9248733370 [G-5877]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

నాలుగు లైన్లకు రూ. : 400/-

అదనపు లైనుకు రూ. : 90/-

GST 5% Extra

రీజనల్ సెంటర్లు - రాజమండ్రి - 9010224454, 9951602906, 9010120345, 9705754205

కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం : 99516 02838

తుని, జగ్గంపేట, యానాం: 90109 67896

అమలాపురం, ముమ్మిడివరం: 97053 47414

పి.గన్నవరం: 97057 49718, రాజోలు: 97053 45456

మండపేట: 99516 02941

రామచంద్రపురం: సెల్: 99516 02936

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం. ఫోన్స్: 0883-2483010